క్లుప్తంగా

కొమ్మమూరు కాల్వలో యువకుడి గల్లంతు

తెనాలిరూరల్: కొమ్మమూరు కాల్వలో యువకుడు గల్లంతయిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. మాచవరానికి చెందిన 22 ఏళ్ల సయ్యద్ యాసిన్ సంగం డెయిరీలో పని చేస్తున్నాడు. ఉదయం తెనాలి మండలం సంగం జాగర్లమూడిలోని కొమ్మమూరు కాల్వ వద్ద బహిర్భూమికి వెళ్లిన అతను కాల్వలో పడిపోయాడు. స్థానికులు గమనించి అగ్నిమాపక అధికారులకు సమాచారం అందించారు. సిబ్బంది వెళ్లి గాలించినా ఫలితం లేకుండాపోయింది. ఘటనపై రాత్రి వరకు ఎటువంటి కేసు నమోదు కాలేదు.

బాలిక అదృశ్యంపై కేసు నమోదు

తెనాలి రూరల్: బాలిక అదృశ్యంపై శుక్రవారం కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. తెనాలి పట్టణంలోని ఇస్లాంపేటకు చెందిన 14 ఏళ్ల బాలిక తొమ్మిదో తరగతి చదువుతోంది. గురువారం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాకపోవడంతో తల్లిదండ్రులు పోలీసులను ఆశ్రయించారు. ఒన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

నేడు ఫార్మశీ కాలేజీలో అంతర్జాతీయ సదస్సు

తెనాలి: ఏపీటీఐ, ఐపీఏ రాష్ట్రశాఖలతో కలిసి స్థానిక ఏఎస్ఎన్ ఫార్మశీ కాలేజీ శనివారం అంతర్జాతీయ సదస్సును నిర్వహించనుంది. 'రోల్ అండ్ ఫ్యూచర్ ప్రాస్పెక్ట్స్ ఆఫ్ రెగ్యులేటరీ ఎఫైర్స్' అనే అంశంపై కాలేజీ సెమినార్ హాల్‌లో వర్చువల్, ఆఫ్‌లైన్‌లో ఈ సదస్సు జరగనుంది. ఇండియన్ ఫార్మాస్యూటికల్ అసోసియేషన్ (ఐపీఏ) జాతీయ అధ్యక్షుడు డాక్టర్ టీవీ నారాయణ ముఖ్యఅతిథి. గౌరవ అతిథిగా ఏపీటీఐ దక్షిణ విభాగం ఉపాధ్యక్షుడు, పీసీఐ ఎగ్జిక్యూటివ్ మెంబరు డాక్టర్ ఎం.వెంకటరమణ, ఉపన్యాసకులుగా సియర్ ఫార్మ్ ఫోరమ్ ప్రొఫెషనల్ సెక్రటరీ డాక్టర్ రావ్ వడ్లమూడి, డాక్టర్ సునీల్‌కుమార్ అగర్వాల్ (మలేషియా), ఏపీటీఐ కర్ణాటక రాష్ట్ర శాఖ అధ్యక్షుడు డాక్టర్ హెచ్.శివకుమార్ పాల్గొంటారు. ఏఎస్ఎన్ ఫార్మశీ కాలేజీ ప్రిన్సిపాల్, సదస్సు కన్వీనర్ డాక్టర్ కె.వెంకటరమణ శుక్రవారం ఒక ప్రకటనలో వివరాలను తెలియజేశారు.

వివాహిత అదృశ్యంపై కేసు నమోదు

రేపల్లె రూరల్: వివాహిత అదృశ్యంపై శుక్రవారం కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్ఐ భరత్ తెలిపారు. పట్టణంలోని 23 వార్డుకు చెందిన రమేష్ అనే వ్యక్తి తన భార్య ఈ నెల 19వ తేదీ నుంచి కనిపించడం లేదని ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామన్నారు.

7న మహంకాళి నాగేంద్ర స్వామి వార్షికోత్సవం

భట్టిప్రోలు: వెల్లటూరు లాక్ సెంటర్‌లో కొలువైన శ్రీ కనకదుర్గ మహంకాళి నాగేంద్రస్వామి ఆలయ 15వ వార్షికోత్సవం మార్చి 7వ తేదీన ఘనంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు జొన్నా సుబ్బారావు భవాని శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఆలయంలో గణపతి పూజ, అభిషేకాలు, కుంకుమ పూజ, శ్రీ రమా సహిత సత్యన్నారాయణ వ్రతం జరుగుతుందని పేర్కొన్నారు. మధ్యాహ్నం అన్న సమారాధన ఉంటుందని తెలిపారు.

ఆరోగ్యంపై శ్రద్ధచూపాలి

భట్టిప్రోలు: తల్లీబిడ్డ ఆరోగ్య సంరక్షణకు వైద్య, ఆరోగ్య సిబ్బంది శ్రద్ధచూపాలని భట్టిప్రోలు సర్పంచ్ దారా రవి కిరణ్మయి పేర్కొన్నారు. స్థానిక గ్రామ పంచాయతీ కార్యలయంలో శుక్రవారం కన్వర్జెన్సీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సర్పంచ్ రవి కిరణ్మయి మాట్లాడుతూ రక్తహీనతతో బాధ పడుతున్న వారిని గుర్తించాలన్నారు.

ధర్నాను జయప్రదం చేయాలి

భట్టిప్రోలు: సీపీఐ ఆధ్వర్యంలో మార్చి 2న విజయవాడలో జరగనున్న మహా ధర్నాను విజయవంతం చేయాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు పి. నాగాంజనేయులు కోరారు. శుక్రవారం భట్టిప్రోలులోని లేఅవుట్లను ఆయన సందర్శించారు. సీపీఐ రేపల్లె, వేమూరు నియోజకవర్గాల కార్యదర్శులు జి.బాలాజి, బి. శ్రీనివాసరావు, లబ్ధిదారులు పాల్గొన్నారు. జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలకు రూ.5 లక్షలివ్వాలని, టిడ్కో గృహ సముదాయాల్లో మౌలిక సదుపాయాలు కల్పించి లబ్ధిదారులకు తక్షణమే పంపిణీ చేయాలని వారు డిమాండ్ చేశారు.

జొన్న పంటను పరిశీలించిన ఏపీ సీడ్ సర్టిఫికేషన్ డైరెక్టర్

తాడికొండ: తాడికొండలో మల్లేశ్వర సీడ్స్ ద్వారా రైతులు బాండ్‌పై సాగు చేస్తున్న జొన్న వెరైటీ సీఎస్‌హెచ్-24ను శుక్రవారం ఏపీ సీడ్ సర్టిఫికేషన్ డైరెక్టర్ ఎ త్రివిక్రమ్‌రెడ్డి, పలువురు శాస్త్రవేత్తలు పరిశీలించారు. రైతులతో సాగులో ఏర్పడిన సమస్యలు, పలు మెలకువలపై సూచనలు జారీ చేశారు. ఈ ఏడాది వాతావరణం అనుకూలించడంతో పంట బాగా పండిందని రైతులు తెలిపారు. ఏపీఎస్ఎస్‌సీఏ జాయింట్ డైరెక్టర్ వి విశ్వనాథన్, ఆచార్య ఎన్‌జీ రంగా విశ్వవిద్యాలయం సీడ్ డైరెక్టర్ ఎ సుబ్బరామిరెడ్డి, శాస్త్రవేత్త గంగాదేవీ, సీఎస్‌సీవో డీడీ బి ప్రసాద్, ఏవో నరసింహారావు, ఏపీసీడ్స్ డీఎం గుంటూరు సుబ్బయ్య, మల్లేశ్వర ఏజెన్సీస్ ఎండీ అనీల్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

పారని మురుగు..తీరని దోమల బెడద

- మురుగు, దోమలతో ఇబ్బందులు పడుతున్న తెనాలి ప్రజలు
- సాయంత్రమైనా వీధుల్లో తొలగని చెత్త
- పెరుగుతున్న జనాభా..సమతూకం కాని పారిశుద్ధ్య కార్మికులు
- ప్రజలు, కౌన్సిలర్లు నిత్యం ఫిర్యాదులు



చెంచుపేటలో తెట్టకట్టిన మురుగు కాల్వ



మారీసుపేటలో డస్ట్‌బిన్‌లో తొలగించని చెత్త

తెనాలిఅర్బన్: తెనాలి పట్టణంలో పారిశుద్ధ్యం పడకేసింది. పారిశుద్ధ్య నిర్వాహణ కోసం నెలకు రూ.లక్షలు వెచ్చిస్తున్న ఆశించిన స్థాయిలో ఫలితం కన్పించటం లేదు. సెలక్షన్ గ్రేడ్ మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ అయినా తెనాలిలో మాత్రం చెత్త, మురుగు సమస్య పరిష్కారం కాకపోవటంపై కౌన్సిలర్లు తరచు అధికారులపై అసంతృప్తి వ్యక్తం చేస్తూనే వస్తున్నారు. మున్సిపాలిటీకి వచ్చే ఎక్కువ ఫిర్యాదులలో పారిశుద్ధ్య నిర్వాహణపైనే. తెనాలి పట్టణంలో సుమారు రెండు లక్షల జనాభా నివశిస్తున్నారు. పట్టణంలోని 40 వార్డులను సౌలభ్యం కోసం తొమ్మిది పారిశుద్ధ్య డివిజన్‌లుగా అధికారులు విభజించి నిర్వాహణ చూస్తున్నారు. వీటిలో రెండు డివిజన్‌లను ప్రభుత్వ పారిశుద్ధ్య కార్మికులు నిర్వహిస్తుండగా మిగిలిన ఏడు డివిజన్‌లను అవుట్ సోర్సింగ్ ఉద్యోగులతో చేయిస్తున్నారు.

రూ.లక్షలు వెచ్చిస్తున్నా.. మెరుగు పడని పారిశుద్ధ్యం

తెనాలి పట్టణంలో పారిశుద్ధ్య నిర్వహణ కోసం 84 మంది ప్రభుత్వ ఉద్యోగులు, 322 మంది అవుట్ సోర్సింగ్ కార్మికులు పనిచేస్తున్నారు. వీరి వేతనాలు, వాహనాల అయిల్ ఖర్చులు కాకుండా ఫాగింగ్, స్ప్రెయింగ్, బ్లీచింగ్ వంటి వాటి కోసం తెనాలి పురపాలక సంఘం నెలకు సుమారు రూ.4లక్షల వరకు వెచ్చిస్తోంది. కార్మికులు ప్రతి రోజు డోర్ టు డోర్ చెత్త సేకరణతో పాటు మురుగు కాల్వలను శుభ్రం చేయాల్సి ఉంటుంది. కానీ ఏ వార్డులోనూ ఈ విధంగా జరగటం లేదు. డస్ట్ బిన్‌లలో నిండిన చెత్తను సాయంత్రం అయిన తొలగించని పరిస్థితి ఉంది. వారానికి రెండు సార్లు మాత్రమే అదీ.. నామమాత్రంగా మురుగు కాల్వలు శుభ్రం చేస్తున్నారు. దీంతో ప్రజలు, కౌన్సిలర్‌లు నిత్యం పారిశుద్ధ్య నిర్వహణపై ఫిర్యాదులు చేస్తూనే వస్తున్నారు.

మురుగు, దోమలతో ఇబ్బందులు

పట్టణంలో దోమల బెడద ఎక్కువగా ఉంది. మురుగు కాల్వలను గత పాలకులు ఒక ప్రణాళిక ప్రకారం నిర్మించకపోవటం వల్ల ఎక్కడ మురుగు అక్కడే నిలచి పోతోంది. చిన్న పాటి వర్షానికి కాల్వలు పొంగి రోడ్లపై మురుగు చేరటం పరిపాటిగా మారింది. దోమల నివారణకు అధికారులు ఫాగింగ్, స్ప్రెయింగ్‌ను చేయించిన దాఖలాలు కనిపించటం లేదు. దోమలులేని కాలం తెనాలిలో ఉండదంటే అతిశయోక్తి కాదు. ఇప్పటికైన మున్సిపల్ అధికారులు స్పందించి పారిశుద్ధ్య నిర్వాహణలోని లోపాలు సరిచేసి ప్రజలకు ఆరోగ్యకరమైన వాతవారణాన్ని కల్పించేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

దోమల నియంత్రణకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తాం



40 వార్డుల్లో పారిశుద్ధ్య నిర్వహణ ప్రతిరోజు చేస్తునే ఉన్నాం. పట్టణ జనాభా విస్తరిస్తుండటం, కార్మికుల సంఖ్య దానికి తగినట్లు లేకపోవడంతో కొన్ని ఇబ్బందులు వస్తున్న మాట వాస్తవం. దోమల నియంత్రణకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తాం. ఫాగింగ్, స్ప్రెయింగ్‌ను ఎక్కువ సార్లు చేయించే విధంగా చర్యలు తీసుకుంటాం.

–ఎం.గోపాలరావు, అసిస్టెంట్ కమిషనర్, తెనాలి పురపాలక సంఘం

సీఎం వైఎస్ జగన్ సభను విజయవంతం చేయండి



పార్టీ శ్రేణులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శివకుమార్

కొల్లిపర: ఈ నెల 27న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చేతుల మీదుగా తెనాలి వ్యవసాయ మార్కెట్ యార్డు రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ అందించి బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే శివకుమార్ తెలిపారు. శుక్రవారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఆయన మండలంలోని అన్ని గ్రామాల నాయకులతో సమావేశం నిర్వహించారు. తెనాలిలో జరిగే సీఎం సభకు ప్రతి గ్రామం నుంచి వేలాదిగా పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలి వచ్చి, విజయవంతం చేయాలని కోరారు. గ్రామాల్లో ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసి, ఎటువంటి అసౌకర్యం లేకుండా పార్టీ కార్యకర్తలను, అభిమానులను సభకు తీసుకురావాలని ఆదేశాలిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మర్రెడ్డి శివరామకృష్ణారెడ్డి, ఎంపీపీ భీమవరపు పద్మావతి, ఎంపీడీఓ పి.శ్రీనివాసులు, డిప్యూటీ తహసీల్దారు బాలకృష్ణారెడ్డి, పార్టీ నాయకులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ఫార్మశీతో ఉజ్వల భవిష్యత్తు



మాట్లాడుతున్న డాక్టర్ కారుమూరి శ్రీనివాసరెడ్డి, పక్కన డాక్టర్ దక్షిణామూర్తి, డాక్టర్ శివ శిరీష

గుంటూరు మెడికల్: ఫార్మశీ రంగం నానాటికీ అభివృద్ధి చెందుతోందని, ఫార్మశీ కోర్సు అభ్యసించిన వారికి ఉజ్వల భవిష్యత్తు లభిస్తోందని సీనియర్ కార్డియాలజిస్టు డాక్టర్ కారుమూరి శ్రీనివాసరెడ్డి అన్నారు. స్థానిక మంగళదాస్‌నగర్‌లోని సిమ్స్ ఫార్మశీ కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలు జరిగాయి. వేడుకలకు ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఫార్మశీ అభ్యసించిన వారికి దేశ, విదేశాల్లో ఉద్యోగ అవకాశాలు మెండుగా ఉన్నాయన్నారు. నూతన ఔషధాలను కనుగొని వ్యాధులను త్వరితగతిన తగ్గించడంలో యువ ఫార్మాశిస్టులు చొరవ చూపించాలన్నారు. డాక్టర్ దక్షిణామూర్తి మాట్లాడుతూ విద్యార్థులు ఆధునిక జీవనశైలి వల్ల అనేక ఇబ్బందులు పడుతున్నట్లు వెల్లడించారు. జీవన శైలిలో మార్పు చేసుకోవాలని, వ్యక్తిగత, వృత్తిపరమైన ఎదుగుదలకు విద్యార్థులు తమ జీవితాన్ని ఏవిధంగా మలచుకోవాలనే విషయాలను వివరించారు. సిమ్స్ సెక్రటరీ డాక్టర్ జి.శివశిరీష మాట్లాడుతూ ఫార్మశీ విద్యార్థులకు నాణ్యమైన బోధన తమ కళాశాలలో అందిస్తున్నామని, పలు రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు తమ కళాశాలలో అభ్యసిస్తున్నట్లు వెల్లడించారు. విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలతో ఆహూతులను అలరించారు.

ప్రతిభకు పురస్కారం



చేబ్రోలు పీఎస్ సీఐ సుబ్బారావుకి ప్రశంసా పత్రం అందిస్తున్న ఎస్పీ ఆరిఫ్‌హఫీజ్

నగరంపాలెం: వివిధ కేసుల్లో ప్రతిభ కనబరిచిన సీఐలు, ఎస్ఐ, కానిస్టేబుళ్లను జిల్లా ఎస్పీ అభినందించారు. నగరంపాలెం జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలోని స్పందన హాల్‌లో శుక్రవారం జిల్లా నేర సమీక్ష సమావేశం జరిగింది. సమావేశ అనంతరం చేబ్రోలు పీఎస్ సీఐ సుబ్బారావు, ఎస్ఐ డి.రవీంద్రబాబు, మహిళా కానిస్టేబుల్ నాగమణి, తాడికొండ పీఎస్ సీఐ శ్రీనివాసరావు, కానిస్టేబుల్ బి.కిరణ్‌బాబును ప్రత్యేకంగా అభినందించి ప్రశంస పత్రాలను అందించారు. 2021లో కాకుమాను మండలం వల్లూరులో తల్లిని తనయుడు హత్య చేయగా, ఈ కేసులో తనయుడికి గురువారం యావజ్జీవ కారాగార శిక్ష విధించారు. 2015లో తాడికొండ పాములపాడులో ఒకరిని హత్య చేయగా, అందులో ముగ్గురికి పదేళ్లు, మిగతా అయిదుగురికి ఒక్కొక్క సంవత్సరం కారాగార శిక్ష రెండు రోజుల క్రితం విధించారు. ఈ క్రమంలో విధులు సమర్థవంతంగా నిర్వర్తించిన సీఐలు, ఎస్ఐ, కానిస్టేబుళ్లను ఎస్పీ అభినందించారు.



చేబ్రోలు ఎస్ఐ రవీంద్రబాబు



చేబ్రోలు మహిళా కానిస్టేబుల్ నాగజ్యోతి



తాడికొండ సీఐ శ్రీనివాసరావు



తాడికొండ కానిస్టేబుల్ కిరణ్‌బాబు

ఆకట్టుకున్న స్టాల్స్



నిమ్మరసం తాగుతున్న డాక్టర్ బాబ్జి, పక్కన డాక్టర్ పద్మావతి దేవి, డాక్టర్ ప్రభావతి

గుంటూరు మెడికల్: గుంటూరు వైద్య కళాశాల జింఖానా ఆడిటోరియంలో శుక్రవారం ఆర్థోపెడిక్ సర్జన్స్ రాష్ట్ర సదస్సు ప్రారంభమైంది. మూడు రోజులపాటు జరుగనున్న సదస్సును డాక్టర్ వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ కోరుకొండ బాబ్జి ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. సదస్సు ప్రారంభానికి ముందు ఆడిటోరియం ప్రాంగణంలో పలు రకాల ఆర్థోపెడిక్ స్పెషాలిటీ వైద్య పరికరాల స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. వీటిల్లో గ్రామీణ నేపథ్యం ఉట్టిపడేలా చలువ పందిళ్లతో, తాటాకులతో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను డాక్టర్ బాబ్జి వీక్షించారు. స్టాల్స్‌లో గ్రామీణ వాతావరణం ఉట్టిపడేలా అంగళ్లు ఏర్పాటు చేశారు. చిన్ననాటి జ్ఞాపకాలు గుర్తుకు వచ్చేలా చక్రాలు, చకోడిలు, బఠాణీలు, ఉప్పుశనగలు, తదితర ఆహార పదార్థాలు, సోడాలు, చెరుకు గడలు అందరిని అమితంగా ఆకట్టుకున్నాయి. పూర్వకాలపు సినిమా పోస్టర్లు స్టాల్స్ ఉంచడంతో గత కాలపు సినిమాల మధురస్మృతులు వైద్యులు నెమరు వేసుకున్నారు.

ట్రేడ్ లైసెన్స్ రెన్యూవల్స్ తప్పనిసరి

నెహ్రూనగర్: నగరంలో నూతన డీ అండ్ ఓ ట్రేడ్ లైసెన్సులు, రెన్యూవల్స్‌కు తప్పనిసరిగా సదరు సంస్థల ఆస్తి, ఖాళీ స్థల, నీటి పన్నులు పూర్తిగా చెల్లించిన రశీదులు ఉంటేనే చేయాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి శానిటేషన్ కార్యదర్శులు, ప్రజారోగ్య అధికారులకు స్పష్టం చేశారు. శుక్రవారం నగరపాలక సంస్థ కాన్ఫరెన్స్ హాల్లో ప్రజారోగ్య విభాగ అధికారులతో, జూమ్ ద్వారా శానిటేషన్ కార్యదర్శులతో నగరంలో పారిశుద్ధ్య పనులు, ఇంటింటి చెత్త సేకరణ, ట్రేడ్ లైసెన్స్‌లపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో ప్రతి కమర్షియల్ సంస్థ తప్పనిసరిగా ట్రేడ్ లైసెన్స్ కలిగి ఉండాలని, ట్రేడ్ లైసెన్స్ నూతనంగా మంజూరు చేసేప్పుడు సదరు సంస్థ నగరపాలక సంస్థకు చెల్లించాల్సిన అన్ని రకాల పన్నులు చెల్లించి ఉంటేనే దరఖాస్తు ప్రాసెస్ చేయాలని శానిటేషన్ కార్యదర్శులకు, ఇన్‌స్పెక్టర్లను ఆదేశించారు. ప్రతి షాప్ వద్ద డస్ట్ బిన్లు ఏర్పాటు చేసుకోవాలని, వ్యర్థాలను రోడ్ల పై, కాల్వల్లో వేసే షాప్స్ సీజ్ చేయాలని ఆదేశించారు. సిఎంఓహెచ్ డాక్టర్ విజయలక్ష్మీ, ఎంహెచ్‌ఓ డాక్టర్ భాను ప్రకాష్, ఈఈ కొండారెడ్డి పాల్గొన్నారు.

గట్టెక్కనున్న విద్యార్థుల కష్టాలు

- చొరవ చూపిన ఎమ్మెల్యే ఆర్కే
- రెండు ఫుట్ బ్రిడ్జిల నిర్మాణానికి ముందుకొచ్చిన కాఫీ కంపెనీ
- సర్వే చేసిన కంపెనీ ప్రతినిధులు



ఫుట్ బ్రిడ్జిల నిర్మాణాలకు సర్వే చేస్తున్న కాంటినెంటల్ కాఫీ లిమిటెడ్ ఇంజనీర్ల బృందం

తాడేపల్లిరూరల్: ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) చొరవతో దుగ్గిరాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థుల కష్టాలు గట్టెక్కనున్నాయి. దుగ్గిరాల బకింగ్‌హాం కెనాల్‌పై ఫుట్ బ్రిడ్జి నిర్మించేందుకు దుగ్గిరాల మండలం మంచికలపూడిలో ఉన్న కాంటినెంటల్ కాఫీ లిమిటెడ్ కంపెనీ వారు ముందుకువచ్చి సర్వే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇటీవల కాలంలో కాంటినెంటల్ కాఫీ యాజమాన్యాన్ని ఎమ్మెల్యే ఆర్కే కలసి మంచికలపూడి, దుగ్గిరాల, సుగాలీకాలనీల వద్ద ఫుట్ బ్రిడ్జిలు నిర్మించాలని కోరారు. స్పందించిన వారు రెండు చోట్ల సర్వే నిర్వహించి ఫుట్ బ్రిడ్జిల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. ఈ బ్రిడ్జిల నిర్మాణం వల్ల దుగ్గిరాల ప్రాంతంలోని ఎస్సీ కాలనీ, చెన్నకేశవనగర్ ప్రజలతో పాటు దుగ్గిరాల బాలికలు, బాలుర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులు సులువుగా పాఠశాలలకు చేరుకుంటారు. మంచికలపూడి వద్ద పెట్రోలు బంకు ఎదురుగా నిర్మిస్తున్న ఫుట్ బ్రిడ్జి వల్ల ఆ ప్రాంత రైతులకు సైతం ఎంతో మేలు చేకూరనుంది. ఫుట్ బ్రిడ్జిల నిర్మాణాలకు సంబంధించిన అనుమతులు సైతం పొందినట్లు కాంటినెంటల్ కాఫీ ఫొడర్ కంపెనీ ఇంజినీర్లు తెలిపారు.

ధర్నా జయప్రదం చేయండి

తాడేపల్లిరూరల్: టిడ్కో గృహాలలో మౌలిక వసతులు కల్పించాలని కోరుతూ మార్చి 2వ తేదీన విజయవాడలో నిర్వహించనున్న ధర్నాను జయప్రదం చేయాలని సీపీఐ మంగళగిరి నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య అన్నారు. శుక్రవారం మంగళగిరిలోని వేములపల్లి శ్రీకృష్ణ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. సీపీఐ పోరుబాట వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు.

అనారోగ్యంతో సచివాలయ ఉద్యోగిని ఆత్మహత్య

కొల్లూరు : అనారోగ్య సమస్యలతో వేమూరు సచివాలయం-2లో ఇంజనీరింగ్ అసిస్టెంట్‌గా చేస్తున్న సరళ (28) శుక్రవారం ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు. కొల్లూరుకు చెందిన విశ్రాంత ఆర్మీ ఉద్యోగి తోట సూర్యనారయణ, కుమార్తె సరళ, కుమారుడితో.. స్థానిక గౌడపాలెం గుంటపునుగులు చెట్టు ప్రాంతంలో నివసిస్తున్నారు. కరోన కారణంగా తల్లి మరణాన్ని జీర్ణించుకోలేని సరళ ఏడాదిగా అనారోగ్యంతో బాధపడుతోంది. ఈ క్రమంలో ఆమె తన గదిలో చున్నీతో ఉరి వేసుకుంది. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు కొల్లూరు ఎస్ఐ శామ్యూల్ రాజీవ్‌కుమార్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

అక్షయ పాత్ర ఫౌండేషన్‌కు ఫుడ్ డెలివరీ వాహనాలు అందజేత

తాడేపల్లిరూరల్: నగర పరిధిలోని అక్షయపాత్ర ఫౌండేషన్‌కు కీసర టోల్‌ప్లాజా ఆధ్వర్యంలో రెండు ఫుడ్ డెలివరీ వాహనాలు అందజేశారు. ఈ మేరకు శుక్రవారం అక్షయ పాత్ర ఆవరణలో జరిగిన కార్యక్రమంలో వాహనాల పత్రాలను అందజేశారు. స్వర్ణ టోల్‌వే ప్రైవేట్ లిమిటెడ్ కీసర టోల్‌ప్లాజా కంపెనీ సెక్రటరీ రమణ సాయి, డీజీఎం రాజారావు అక్షయ పాత్ర ఫౌండేషన్ వారికి 2వేల మంది పై చిలుకు పిల్లలకు భోజనం సరఫరా చేసేందుకు వీలుగా రెండు వాహనాలను తయారు చేసి అందించారు. కార్యక్రమంలో టోల్‌ప్లాజా మేనేజర్ జయప్రకాష్, అక్షయపాత్ర ఈహెచ్ఎస్ఓ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గొలుసు చోరీ కేసులో నిందితుడు అరెస్టు

గుంటూరు ఈస్ట్: బంగారు గొలుసు చోరీ చేసిన నిందితుడిని లాలాపేట పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఏటుకూరు రోడ్డులో ఎం.అంజమ్మ టీ షాపు నిర్వహిస్తోంది. ప్రకాశం జిల్లాకు చెందిన ముప్పరాజు అశోక్ గురువారం టీషాపునకు వచ్చి అంజమ్మను మంచినీళ్లు అడిగాడు. అంజమ్మ లోపలకు వెళ్లి నీళ్లు ఇచ్చే సమయంలో అశోక్ గల్లాపెట్టెలోని బంగారు గొలుసు తీసుకుని ఉడాయించాడు. అంజమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు శుక్రవారం నిందితుడిని అదుపులోకి తీసుకుని బంగారం గొలుసు స్వాధీనం చేసుకున్నారు.

అలరించిన సంకీర్తనలు

పాతగుంటూరు: బృందావనగార్డెన్స్ వేంకటేశ్వరస్వామి ఆలయంలోని అన్నమయ్య కళావేదికపై బెల్లంకొండ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షురాలు చింతలపాటి రమాగోపాలకృష్ణన్ ఆధ్వర్యంలో మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ సంకీర్తనల గానం నిర్వహించారు. గాయనీమణులు చింతలపాటి రమామహేశ్వరి, పావని, అంజనీదేవి, ప్రణవి వెంగమాంబ కీర్తనలు, అన్నమయ్య సంకీర్తనలను శ్రావ్యంగా గానం చేసి అలరించారు.

క్రీడాకారిణులకు సత్కారం

తెనాలి: వాలీబాల్‌లో విశేష ప్రతిభను కనబరుస్తున్న స్థానిక కోగంటి శివయ్య మున్సిపల్ ఉన్నత పాఠశాల విద్యార్థినులను క్రీడాభారతి, తెనాలి శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా సత్కరించారు. పాఠశాల క్రీడామైదానంలో జరిగిన సభకు ప్రధానోపాధ్యాయుడు రాజారెడ్డి అధ్యక్షత వహించారు. అండర్-17 అంతర జిల్లాల వాలీబాల్ పోటీల్లో విజేతగా నిలిచిన జిల్లా జట్టుకు వై.చంద్రిక, కె.ప్రతిమ ప్రాతినిధ్యం వహించారు. వీరిలో వై.చంద్రిక త్వరలో జరగనున్న జాతీయ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ జట్టుకు ఆడనుంది. చంద్రిక గతేడాది ఇక్కడే పదోతరగతి పూర్తిచేసింది. వీరిద్దరితోపాటు అండర్-14 విభాగం అంతర జిల్లాల వాలీబాల్ పోటీల్లో విజేత గుంటూరు జిల్లా జట్టుకు ఆడిన స్కూలు విద్యార్థిని ఎస్‌బీఎస్ దీప్తితో పాటు జి.దేవి, దీపికలను సత్కరించారు. యర్రంశెట్టి హనుమంతరావు, అంబటి మారుతీరామ్, దూళ్ల నరసింహారావు, సింగాల రామమోహనరావు, శశాంక్ మణికంఠ, కృష్ణ పాల్గొన్నారు. చంద్రబోస్ స్వాగతం పలుకగా అంబరీషుడు పర్యవేక్షించారు. క్రీడలకు సహకరించిన మరికొందరు ఉపాధ్యాయులనూ సత్కరించారు. విద్యార్థులకోసం వ్యాయామ పరికరాలను పీఈటీ జె.రమేష్ అందజేశారు.

కళాకారుడు శివకోటేశ్వరరావుకు సన్మానం



తెనాలిఅర్బన్: నందమూరి తారక రామారావు శతజయంతి ఉత్సవాల్లో భాగంగా పెమ్మసాని థియేటర్‌లో శుక్రవారం రామకృష్ణులు చిత్రాన్ని ఉచితంగా ప్రదర్శించారు. అనంతరం ప్రముఖ పౌరాణిక, సాంఘిక నాటక కళాకారుడు రెడ్డి శివకోటేశ్వరరావును ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బాపయ్య చౌదరి, చంద్రవ్యాస్, సురేష్, హరీష్, పాములు, పెమ్మసాని పోతురాజు, డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు, సోమవారపు సాంబశివరావు, ఈదర శ్రీనివాసరావు, దేవరపల్లి భవాని, ఎన్టీఆర్ జగన్, ముప్పనేని రాఘవరావు, దేవిశెట్టి భాస్కర్, గుమ్మడి ప్రసాద్, కాకుమాను ఉపేంద్ర, నరేంద్ర, ముళ్ళపూడి వెంకట్, నల్లూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ



నిజాంపట్నం: అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం శుక్రవారం కనులవిందుగా జరిగింది. మండలంలోని అడవులదీవిలో డీసీఎంఎస్ చైర్‌పర్సన్ యార్లగడ్డ భాగ్యలక్ష్మి, మదన్ దంపతులు సహకారంతో ఆంజనేయస్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. కూచిబొట్ల శ్రీరామకృష్ణ శర్మ ఆధ్వర్యంలో పలువురు వేద పండితులు శాస్త్రోక్తంగా విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఎంపీ మోపిదేవి వెకటరమణారావు, ఆయన సతీమణి అరుణభాస్కరి ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గుంటూరు నగరపాలక సంస్థ మేయర్ కావటి శివమనోహర్ నాయడు, బౌడా చైర్మన్ దేవినేని మల్లికార్జున రావు, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు, ఎంపీపీ మోపిదేవి విజయనిర్మల హరనాథబాబు, జడ్పీటీసీ నర్రా సుబ్బయ్య, రేపల్లె మున్సిపల్ చైర్ పర్సన్ కట్టా మంగ, మాజీ ఎంపీపీ ప్రసాదం వాసుదేవ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. భారీగా అన్నదానం చేశారు. సర్పంచ్ శొంఠి శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ నాయకులు బండారు రామారావు, కేంద్ర సహకార బ్యాంక్ డైరెక్టర్ నల్లపాటి రామయ్య, ఎంపీటీసీ రాజేష్‌ఖన్నా, నాజర్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ డిజిటల్ లైబ్రరీల ఏర్పాటు విప్లవాత్మకం

- ఈ అంశంపై రచయితలు తమ వ్యాసాలు, రచనలు పంపవచ్చు
- ఏపీ గ్రంథాలయ పరిషత్ చైర్మన్ మందపాటి శేషగిరిరావు

తాడేపల్లిరూరల్: జిల్లా స్థాయి నుంచి గ్రామ స్థాయి వరకు ప్రతి ఒక్క గ్రంథాలయాన్ని డిజిటల్ లైబ్రరీగా ప్రభుత్వం మారుస్తుందని గ్రంథాలయ పరిషత్ చైర్మన్ మందపాటి శేషగిరిరావు అన్నారు. శుక్రవారం మంగళగిరి రాష్ట్ర గ్రంథాలయ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మన సంస్కృతి సాంప్రదాయాలతో పాటు, మన చరిత్రను విద్యార్థులకు, ఉపాధ్యాయులకు అవసరమైన ఇతర అంశాలను పొందుపరుస్తూ ప్రతి లైబ్రరీని డిజిటలైజేషన్ చేస్తున్నారన్నారు. వైఎస్సార్ డిజిటల్ లైబ్రరీల ఏర్పాటు ఓ విప్లవాత్మకమైన మార్పు అని అన్నారు. ఈ కార్యక్రమంపై కవులు, మేధావులు, రచయితలు తమ కవితలు, పాటలు, పద్యాలు, వ్యాసాలను మార్చి 7వ తేదీ లోపు మనం - మన గ్రంథాలయం, గ్రంథాలయ పరిషత్ కార్యాలయం, మెట్ల బజార్, మంగళగిరి, గుంటూరు జిల్లా అడ్రస్‌కు పంపవచ్చన్నారు. మరిన్ని వివరాలకు 9849974431 నెంబరులో సంప్రదించాలన్నారు.

సర్వీస్ నౌ టెక్నాలజీపై అవగాహన అవసరం

తాడేపల్లిరూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరంలో ఉన్న కేఎల్ విశ్వవిద్యాలయంలో శుక్రవారం సర్వీస్ నౌ టెక్నాలజీపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అంతర్జాతీయ సర్వీస్ నౌ సంస్థ సీనియర్ డైరెక్టర్ మందా అనిత విచ్చేశారు. ఆమె మాట్లాడుతూ సర్వీస్ నౌ టెక్నాలజీపై విద్యార్థులు అవగాహన పెంచుకోవడం వలన ప్రాంగణ ఎంపికల్లో మంచి ఫలితాలు పొందవచ్చని అన్నారు. అనంతరం హ్యాక్‌థాన్‌లో ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డీన్ డాక్టర్ ఎ.శ్రీనాథ్, సర్వీస్ నౌ సంస్థ వర్క్ ఫోర్స్ అభివృద్ధి నిపుణులు భాస్కర్, క్లయింట్ సక్సెస్ మేనేజర్ ప్రవీణ్‌కుమార్, సర్వీస్ నౌ భాగస్వామి సంస్థ జీటెక్నో సీఈవో విద్యాసాగర్, విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారధి వర్మ, ప్రొ చాన్సలర్ డాక్టర్ ఎస్.వెంకటరామ్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎ.జగదీష్, అధ్యాపకుల వ్యవహారాల డీన్ డాక్టర్ వి.శ్రీకాంత్, ఇంజినీరింగ్ కళాశాలల ప్రిన్సిపాల్ డాక్టర్ టి. రామకృష్ణ, డాక్టర్ టి.పవన్‌కుమార్, సాక్ అసోసియేట్ డీన్ డాక్టర్ కె.రూతు రమ్య, డాక్టర్ శ్యామ్, డాక్టర్ పి.రాజరాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.